క్లుప్తంగా

కడప రిమ్స్ సీఐగా రామకృష్ణారెడ్డి

కడప అర్బన్: కడప రిమ్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గా రామకృష్ణా రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కమలాపురం, ప్రొద్దుటూరు 1 టౌన్ స్టేషన్లలో ఆయన సీఐ గా పని చేశారు. కాగా ఇక్కడ పని చేస్తున్న సీఐ సీతారామిరెడ్డి పులివెందులకు బదిలీ అయ్యారు. సీఐ గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

ఆర్టీసీ కడప డీఎంగా కన్యాకుమారి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆర్టీసీ కడప డిపోలో అసిస్టెంట్ మేనేజర్ గా పని చేస్తున్న కన్యాకుమారిని డిపో మేనేజర్ గా నియమిస్తూ సోమవారం ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మైదుకూరు డీఎం గా శ్రీలత, ప్రొద్దుటూరు డీఎంగా గంగాధర్, పులివెందుల డీఎంగా ప్రేమ్ కుమార్, కడప ఈడీ ఆఫీస్ లో పనిచేస్తున్న సురేంద్ర కుమార్ తిరుపతి డీఎంగా ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా కరీముల్లా

కడప అర్బన్: కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఎఫ్ఏసి)గా కరీముల్లా షరీఫ్ సోమవారం కడప నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో వున్న రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ వి అండ్ ఈ ఓగా పనిచేసిన శ్రీనివాసరావు ఆగస్టు నెలాఖరున పదవీవిరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో ప్రస్తుతం తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్‌కు అదనంగా కడప వి అండ్ ఈ ఓగా నియమించారు. ఈక్రమంలో ఆయన బాధ్యతలను చేపట్టారు.

జేవీవీ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక కడపజిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ప్రొద్దుటూరు నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో జరిగిన మహాసభలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుర్రా రామారావు, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో నూతన కమిటీ అధ్యక్షులుగా షామీర్ బాష,ప్రధాన కార్యదర్శిగా శివరాం, సమత, కన్వీనర్‌గా రామసుబ్బమ్మ లను ఎన్నుకున్నారు. అదే విధంగా ఉపాధ్యక్షులుగా బాలబయన్న, దేవదత్తం, వెంకటసుబ్బయ్య, వెంకటరామరాజు, రవూఫ్ బాష, పి.మహేష్ లను, కార్యదర్శులుగా రాజేష్, నరసింహారెడ్డి, ప్రసన్నకుమార్, డేవిడ్ రాజ్, ఖాసిం వల్లి, కిరణ్ కుమార్ లను, గౌరవ అధ్యక్షులుగా ప్రొ. వెంకటరామిరెడ్డి, డా. రాజావెంగళ్ రెడ్డి, రఘునాథరెడ్డి, గౌరవ సలహాదారులుగా కుమారస్వామిరెడ్డి, రామచంద్రారెడ్డి, గోపీనాథ్ రెడ్డి, గంగాధర్ రెడ్డిలతో పాటు కార్యవర్గ సభ్యులుగా పది మందిని ఎన్నుకున్నారు.

అభినందన

కడప ఎడ్యుకేషన్: కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సరితకు 'మదర్ థెరిసా' అవార్డు లభించింది. మదర్ థెరిసా జయంతి వేడుకల సందర్భంగా విజయవాడలోని ఎక్స్-రే లిటరరీ కల్చరల్ , సర్వీస్ ఆర్గనైజేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. జాతీయ సేవా పథకం ద్వారా సమాజానికి అందించిన సేవలను గుర్తించి 2002 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గా, 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఒకవైపు సామాజిక సేవలో మరోవైపు బోధనా, పరిశోధన రంగంలో పేటెంట్ సైతం అందుకున్న డాక్టర్ సరితను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారు. ఆమెను విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ, ప్రిన్సిపల్ టి శ్రీనివాస్ ప్రశంసించారు.

పలువురి చేరిక

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల, పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయ జ్యోతి సమక్షంలో పార్టీ కడప జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరంలోని 25 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కడప నగరంలోని వివిధ డివిజన్ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కడప కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఏపీ ఎస్‌టీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఎఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకులమురళి, జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చితికిపోతున్న చిన్న పరిశ్రమలు

- ఏ ఏడాది రాయితీలు ఆ ఏడాదే చెల్లిస్తామన్న మాటలు ఉత్తిదే
- జిల్లాలో ఎంఎస్ఎంఈలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు రూ.136 కోట్లు
- అధికారంలోకి వచ్చి 15 మాసాలవుతున్నా పట్టించుకోని సర్కార్
- మే నెల 15లోపు ఇస్తామని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ
- నేడు కొప్పర్తిలో మంత్రి లోకేష్ పర్యటన



ఏపీఐఐసీ కార్యాలయం

కడప కార్పొరేషన్: జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఎంఎస్ఎంఈలకు ఏ ఏడాదికి ఆ ఏడాది ప్రోత్సాహకాలు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వాటి గురించే ఆలోచన చేయని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఎంఎస్ఎంఈలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఫలితంగా.. గతంలో ఎన్నడూ లేనివిధంగా చాలా యూనిట్లు మూతపడుతున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ సాక్షాత్తు పార్లమెంటులోనే ఇటీవల వెల్లడించడం గమనార్హం.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ ఏడాది జూలై 28 వరకు మొత్తం 2,191 ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడినట్లు తెలుపగా, జిల్లాలో సుమారు 80 పరిశ్రమలు మూతపడినట్లు తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 25 పరిశ్రమలు మూతపడ్డాయంటే ఎంఎస్ఎంఈల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎంఎస్ఎంఈలు మూతపడటం ద్వారా సుమారు వెయ్యిమంది ఉపాధి కోల్పోయినట్లు అంచనా.

వెంటాడుతున్న సమస్యలు ..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం సకాలంలో ప్రోత్సాహకాలు విడుదల చేయకపోవడం, మానవ వనరుల కొరత, ముడిసరుకుల ధరల పెరుగుదల, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే కరెంటు బిల్లుల రూపంలో గట్టి షాక్ ఇచ్చింది. దీంతో ఎంఎస్ఎంఈలపై విద్యుత్ బిల్లుల భారం అధికంగా పెరిగిపోయింది. ఏప్రిల్ మాసంలో ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాలో పర్యటించి మే 15లోపు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. మూడు నెలలు పూర్తయినా ప్రభుత్వం వాటి ఊసే పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏ ఏడాది ప్రోత్సాహకాలు ఆ ఏడాదే ఇచ్చే స్తాం... ఇందుకోసం ప్రత్యేకంగా కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామన్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, కూటమి నేతల మాటలు నీటిమూటలయ్యాయి. జిల్లాకు సుమారు రూ.305 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాల్లో కనీసం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఇందులో ఎంఎస్ఎంఈలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు రూ.136కోట్ల వరకూ ఉన్నాయి. ఇంకోపక్క ఎంఎస్ఎంఈల ఉత్పత్తులను ప్రభుత్వ శాఖలు కూడా కొనుగోలు చేయకపోవడం, ప్రభుత్వ అసమర్థ విధానాలతో ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోవడంతో ఈ ప్రభావం ఎంఎస్ఎంఈ యూనిట్లపై ప్రత్యక్షంగా పడుతోంది.

సేల్ రిజిస్ట్రేషన్లు చేయని ఏపీఐఐసీ

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ)నుంచి భూములు కొనుగోలు చేసిన పారిశ్రామిక వేత్తలు తీవ్రంగా నలిగిపోతున్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో భూమి అందుబాటులో ఉన్నా చాలా ప్లాట్లలో లోతైన గుంతలు, పెద్ద పెద్ద కాలువలు, కంపచెట్లు అడవిలాగా ఉన్నాయి. వెయ్యి అడుగులు వేసినా బోర్లలో నీరు పడటం లేదు. ఈ సమస్యలు పరిష్కరించకుండా యూనిట్లు నెలకొల్పాలని పారిశ్రామిక వేత్తలపై ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పరిశ్రమలు నెలకొల్పిన పారిశ్రామిక వేత్తలకు సేల్ రిజిస్ట్రేషన్ చేయడానికి అనేక వంకలు పెడుతున్నారన్న విమర్శలున్నాయి. ఏపీఐఐసీ నుంచి భూమిని కొనుగోలు చేసేముందు డీపీఆర్‌లో ఎంతమందికి ఎంప్లాయిమెంట్ కల్పిస్తామని చెప్పారో అంతమందికి పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, అప్పుడే సేల్ రిజిస్ట్రేషన్ చేస్తామని ఖరాఖండిగా చెబుతుండటంతో కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల సేల్‌డీడ్‌లు ఆగిపోయాయి. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ కారణం చూపి సేల్ రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపలేదని పారిశ్రామిక వేత్తలు చెబుతున్నారు. పరిశ్రమల ద్వారా కల్పిస్తున్న ఎంప్లాయిమెంట్‌ను 20 లక్షల ఉద్యోగాల్లో చూపి తమ ఘనతగా చెప్పుకోవాలనే ఉద్దేశ్యంతోనే దీనిపై ఇంత మొండిగా ముందుకుపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నేడు రాష్ట్ర విద్యాశాఖామంత్రి లోకేష్ కొప్పర్తిలో పర్యటించనున్నారు. తాము ఎదుర్కొంటున్న ఈ సమస్యలను ఆయన పరిష్కరిస్తారన్న నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయాలి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం వెంటనే ప్రోత్సాహకాలను విడుదల చేయాలి. సకాలంలో ప్రోత్సాహకాలు ఇస్తే యూనిట్లు మూతపడే పరిస్థితి రాదు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు బ్యాంకుల నుంచి సహకారం కొరవడింది. ఏపీఐఐసీ ద్వారా ఇచ్చే భూమిని 99 ఏళ్ల లీజు లేదా సేల్ రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలను ఆదుకోవడానికి ప్రత్యేక విధానం తీసుకురావాలి.

– ఓబిలి శంకర్, డిక్కీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్

వైవీయూ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



విద్యార్థులతో కలిసి వైవీయూ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: వైవీయూ అభివృద్ధిపై ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలని, వెంటనే రూ. 100 కోట్లు నిధులను విడుదల చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం వైవీయు ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులతో కలిసి ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైవీయు ఆర్ఎస్ఎఫ్ కన్వీనర్ నరసింహులు, నాయకులు సునీల్, ఉపేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షలు పలికిన వినాయక లడ్డు



కడప కోటిరెడ్డిసర్కిల్ : వినాయక లడ్డూ వేలం పాట ద్వారా రూ. 3 లక్షలు పలికింది. కడప నగరం వివేకానందనగర్ (ఓం శాంతినగర్)లో శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవ కమిటీ వారు స్వామి విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఇందులో స్థానికులు ఎర్రగుడి శ్రీధర్‌రెడ్డి, తులసి పాల్గొని స్వామి వారి లడ్డూను రూ. 3 లక్షలకు దక్కించుకున్నారు.

వైవీయూ విభాగాధిపతులతో వీసీ భేటీ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ వంటి కోర్సులు నూతనంగా తీసుకురావడంతోపాటు అదనపు భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ, ప్రిన్సిపాల్ క్యాంపస్ కాలేజీ, ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామి రెడ్డి, హెచ్ఓడీఎస్, పీఎం-ఉషా సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్య మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కడపకు మంగళవారం రానున్న సందర్భంగా వైవీయూ అభివృద్ధిపై ఆయనను అభ్యర్థించనున్నామని తెలిపారు. ఎంబీఏ బ్లాక్‌ను పూర్తి చేయడానికి నిధుల మంజూరు , క్యాంపస్‌లోని అసంపూర్తిగా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఇతర బ్లాక్‌లు పూర్తి చేయడానికి నిధులు కోరుతామన్నారు. డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



వైవీయూ అవసరాలపై డీన్లు, విభాగాధిపతులతో సమీక్షిస్తున్న వీసీ శ్రీనివాసరావు

నేడు చింతకొమ్మదిన్నెలో మంత్రి లోకేష్ పర్యటన

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ సెంటర్ ప్రారంభోత్సవానికి, ఏపీఐఐసీ లో పరిశ్రమలకు సంబంధించినవాటి ప్రారంభోత్సవానికి, కమలాపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జడ్పీ ఉన్నత పాఠశాలలోని సెంట్రలైజ్‌డ్ కిచెన్‌లో ట్రయిల్ రన్ కూడా నిర్వహించారు.

ఎన్జీఓ కాలనీలో హోంగార్డు అత్యుత్సాహం

- రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ఐచర్ వాహనం
- ఇద్దరికి తీవ్రగాయాలు



దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు

కడప అర్బన్: గణేశుని ఉత్సవాలలో ఊరేగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఎన్జీఓ కాలనీలో ఓ హోంగార్డు, డిజె వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌కు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో డిజె వ్యాన్ డ్రైవర్ తాను ముందుకు వెళ్లలేననీ, నీవు వచ్చి ఐచర్ వాహనం నడుపుదువు రా అనీ ఎగతాళి చేశాడు. ఈ ఎగతాళిని సీరియస్‌గా తీసుకున్న హోంగార్డు తాను వెంటనే ఐచర్ వాహనంను ముందుకు నడిపాడు. అదే సమయంలో ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలలో వస్తున్న వారిని ఢీకొన్నాడు. దీంతో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసినా ఎంతసేపటికి రాకపోవడంతో ఆటోలో రిమ్స్‌కు తీసుకుని వెళ్లి చికిత్స చేయిస్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు ఐచర్ వాహనం కిందపడటంతో దెబ్బతిన్నాయి. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

సాధనతో అందమైన చేతిరాత

కడప ఎడ్యుకేషన్: సాధనతో అందమైన చేతిరాత సాధ్యమని కడప మండల విద్యాశాఖాధికారి- 1 ఎస్. రఫీక్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరం 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 'క్యాలీగ్రఫీ' ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ మాట్లాడుతూ సాధన చేస్తే ముత్యాల్లాంటి అక్షరాలు రాయడం సాధ్యమవుతుందన్నారు. ఎంఈఓ-2 ఎస్. ఇర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ రాత బాగుంటే మార్కులు వస్తాయన్నారు. పాఠశాల కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఓ. కవితా సుధారాణి, హ్యాండ్ రైటింగ్ శిక్షణ నిపుణులు బ్రహ్మయ్య (మార్క్), లుతియ, పాఠశాల హెచ్ఎం దాది నాగరాజు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి

కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఓపి బ్లాక్ వద్ద ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్రదానం ఆవశ్యకత గూర్చి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ వై.శ్రీనివాసులు, కంటివిభాగం విభాగాధిపతి డాక్టర్ జ్ఞాన ప్రసాద్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ సుశీల, డిపిఎం డాక్టర్ మాధవిలత, డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య, ఆప్తమాలజీ సిబ్బంది, సీనియర్ రెసిడెంట్లు, పారామెడికల్ విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.



కడప రిమ్స్ ఓపి విభాగం ముందు నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, సిబ్బంది

యువజన విభాగం బలోపేతానికి కృషి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం బలోపేతానికి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఆదివారం రాత్రి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన షేక్ ఉమైర్‌ను గల్ఫ్ కన్వీనర్, కడప నార్త్‌జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతీ, యువకులుకు చేస్తున్న మోసాలను వివరించాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసి అవి అమలయ్యేందుకు పోరాటం చేయాలని తెలిపారు. అనంతరం ఉమైర్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య, మైనార్టీ నాయకులు అలీ అక్బర్, చాక్లెట్ గౌస్, డిష్ జిలాన్, ఫయాజ్, గయాజ్ పాల్గొన్నారు.



రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఉమైర్‌ను సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఇలియాస్

ఘన సన్మానం



విజయ్ బాబును సన్మానిస్తున్న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీఎస్పీడీసీఎల్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పదవీ విరమణ చేస్తున్న చప్పలి విజయబాబు సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 బర్నబాస్, దైవ సేవకులు అహరోన్ తెలిపారు. సోమవారం ఉద్యోగ విరమణ సందర్భంగా కడప నగరంలోని హెచ్ఆర్ కన్వెన్షన్ హాలులో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అశోక్ బాబు, పురుషోత్తం, షరీఫ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జమాల్‌బాష దంపతులను సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

డాక్టర్ జమాల్ బాషా సేవలు ప్రశంసనీయం

కడప రూరల్ : కడప నగరంలోని ఐఎంఏ హాల్ లో వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖలో రాయలసీమ జోనల్ మలేరియా ఆఫీసర్ జోన్-4 గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన డాక్టర్ సి జమాల్ బాష అభినందన సన్మాన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిథులుగా డీఎంహెచ్ నాగరాజు, వైద్యశాఖ రాయలసీమ రీజినల్ డైరెక్టర్ రామ గిడ్డయ్య, రిటైర్డ్ డైరెక్టర్ రామిరెడ్డి, ఆర్ఎంవోలు డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా మార్కెట్‌లో నంబర్ వన్ ఎల్ఐసీ

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయకరణ లక్ష్యాలను, ప్రైవేటు పోటీ సవాళ్లను, ఐపీఓ అనంతర అవకాశాలను సమర్థంగా ఉపయోగించుకుని ఎల్ఐసీ బీమా మార్కెట్‌లో 65.81 శాతం వాటాతో నెంబర్ వన్‌గా ఉందని కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్వీ రవికుమార్, మార్కెటింగ్ మేనేజర్ పి.శ్యాంసుందర్‌రావు తెలిపారు. ఎల్ఐసీ తన 69 సంవత్సరాల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని 70వ వసంతంలోకి అడుగిడిన సందర్భాన్ని పురస్కరించుకుని డివిజనల్ కార్యాలయంలో సోమవారం వార్షికోత్సవాలు నిర్వహించారు. సీనియర్ డివిజనల్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్ జ్యోతి ప్రజ్వలన గావించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యేడు జనవరి 20వ తేది 5,88,107 పాలసీలు సేకరించి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందిందని పేర్కొన్నారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ నవ జీవన్ పాలసీ అమ్మకాల్లో కడప డివిజన్ జోన్‌లో నెంబర్ వన్‌గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్యప్రసాద్, లక్ష్మికాంతమ్మ, వివిధ యూనియన్ల నాయకులు ఎ.రఘునాథరెడ్డి, కిరణ్, వీరయ్య, వెంకట కృష్ణ, రామాంజనేయులు, రఫీక్‌ఖాన్, అధికారులు హరీంద్ర, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్

ఆరోగ్యమాత ఆశీస్సులతో మానవాళి శ్రేయస్సు

కడప సెవెన్‌రోడ్స్ : మానవాళి శ్రేయస్సుకు ఆరోగ్యమాత ఆశీస్సులు అవసరమని రెవరెండ్ ఫాదర్ ఎస్.ఫిలోమిన్‌రాజ్ అన్నారు. నగరంలోని ఆరోగ్యమాత తిరునాల మహోత్సవంలో నాల్గవ రోజు ఆయన పూజలు నిర్వహించారు. భక్తుల కోర్కెలను దేవమాత మన్నించాలంటూ ఆయన ప్రార్థించారు. సిద్ధవటం ఆనందాశ్రమానికి చెందిన రెవరెండ్ ఫాదర్ గొల్ల జాన్ మాట్లాడుతూ ఆరోగ్యమాతను ఆశ్రయించిన వారికి ఆమె కుమారుడు అయిన ఏసుప్రభువు ద్వారా అనారోగ్యాలు, కష్టా లు, ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు, సహాయ గురువులు ద్వార్నేస్, డేవిడ్‌రాజ్, సెబాస్టియన్, ఆనందరావు, బాలరాజు, డేవిడ్, విక్టర్, రాజేంద్ర పాల్గొన్నారు.



దైవ సందేశం అందజేస్తున్న గురువులు